అంటున్నాడేంటి! ... అదుగో పంచెకట్టు ఆసామీ, '' పర్లేదు లెండి, మీరిప్పటికే అయిదుగుర య్యారుగా'' అంటున్నాడు కానీ ఆ పెద్దమనిషి మళ్లీ పిలుస్తున్నాడు. ఇంకేం, ఈ పంచెకట్టు ఆసామీ వచ్చివాళ్ళ పక్కన ఆ ఫోర్ సీటర్లో ఇరుకుతున్నాడు!!

అయ్యో, ఇట్టాగ అందరూ కాంప్రమైజేషన్ అయిపోతే ఎట్టాగ సార్! మరి నా సిద్దాంతం సంగతేంటి సార్! అదే, మనిషి స్వార్థాలపుట్ట, కోరికలగుట్ట, గుంపులో గొడ్డు, ఒక్క మాటలో పచ్చి వెదవ- అనే సిద్దాంతం! దాని గతేంటి సార్! అయ్యో అయ్యో నా సిద్ధాంతం!

(జాగృతి పారిశ్రామిక ప్రత్యేకసంచిక 1986)

★★★ ★★★ ★★★

# బెకెట్

"గౌ॥ డాక్టర్ భైషజం గారికి,

నమస్కారాలు. నేను ముప్పయ్యేళ్ళ సంసారిని. సంస్కారిని. నాకిద్దరు పిల్లలు. నాభర్త విద్యాధికుడు మా ఇంట్లో అందరివీ మంచి ఆరోగ్యాలే. ఎటొచ్చీ నాకే ఒక సమస్య వచ్చిపడింది. ఇటీవల నాకు కలలొస్తున్నాయి. అవి ఒక రకంగా నాకు చికాకు కలిగిస్తున్నాయి. హెూమియో వైద్యంలో మీరు మంచి పేరుగలవారని తెలిసి మీకు రాస్తున్నాను. తప్పక మంచి మందు సూచించవలసిందిగా కోరుతున్నాను. నేనిక్కడ కొనుక్కొని వాడగలను.

భవదీయురాలు

అమలాపురం హేమవతి"

1-బి

" హేమవతిగారికి,

అమ్మా, మీ ఉత్తరం అందింది. మీ ఇంట్లో అందరూ ఆరోగ్యంగా ఉన్నారని మీరు చెప్పటం నాకు చాలా ఆనందం కలిగిస్తోంది. ఎందుకంటే లోకంలో ఈనాడు " నా ఆరోగ్యం మంచిది" అని గుండె మీద చెయ్యేసుకుని చెప్పగల జీవుడే కరువైపోయాడు. పోతే మీ కొస్తున్న కలలు ఎలాంటివో, రాత్రిపూట వస్తున్నాయో, పగటి నిద్రలో వస్తున్నాయో మొదటి భాగంలో వస్తాయో, రెండో భాగంలో వస్తాయో , శరీరంలో అప్పుడు కలుగుతున్న మార్పులేమిటో వగైరా అనేక విషయాలు మీరు రాయలేదు. అయినప్పటికీ సాధారణంగా ఇలాంటి కేసుల్లో వాడే మందు 'బెల్లడోనా- ఆరు ఎక్స్'ని రోజూ ఉదయం కాఫీకి ముందరా, రాత్రి భోజనం తర్వాతా నాలుగేసి బిళ్ళల చొప్పున వేసుకోండి. నాది ఉచిత వైద్యం కనుక ఫీజేమీ పంపకండి. పుచ్చుకోను. పదిరోజుల తరువాత రాయండి.

భవదీయుడు

కాకినాడ డాక్టర్ భైషజం"

2-ఎ

" డాక్టర్‌గారికి,

సవినయ నమస్కారాలు! బెల్లడోనా- అరు - ఎక్స్ పదిహేను రోజుల పాటు వేసుకున్నాను మార్పులేదు. కలలు రాత్రిపూటే ఎక్కువగా వస్తుంటాయి. అప్పుడు మనసుకు చాలా ఆనందంగా ఉంటుంది. అప్పుడప్పుడు నా భర్త క్యాంపులకని విశాఖ, విజయవాడ, నెల్లూరు వగైరా ఊళ్ళు వెళ్తొస్తుంటారు. ఆయన రాగానే ఆయన క్షేమాన్ని కనుక్కొంటాను. ఆయన సంపాదించి తెచ్చిన దాన్ని జాగ్రత్తపరచడం వగైరా నా బాధ్యతల్ని సక్రమంగా నిర్వర్తిస్తుంటాను. ఆ తరువాత ఏకాంతంలో ఆయన తను వెళ్ళిన చోట్ల ఆఫీసుల్లో ఉండే సెక్రటరీలు ముఖ్యంగా ఆడవాళ్ళు తన బస గురించి అందులో సదుపాయాల గురించి ఎంత శ్రద్ధ తీసుకున్నదీ చెబుతారు. ఆయనట్లా వర్ణించి చెబుతుంటే నాకేదో ఇబ్బందిగా ఉంటుంది చివరికి నేనే ఈ సెక్రటరీ అయినట్టు, ఇంకో ఉద్యోగస్థుడికి సకల సేవలూ చేస్తున్నట్టూ ఊహించుకుంటుంటాను. రాకూడదనుకుంటే ఆ ఊహలే నిద్రలో వచ్చి నిజం కలలై కూర్చుంటాయి. ఇందువల్ల మనస్సుకేదో ఆనందం అయినప్పటికీ ఎక్కడో ఏదో, గిల్టీ ఫీలింగు... ఏంటో చెప్పలేను. ఇది జబ్బంటారా? అయితే దయచేసి మందు రాయండి.

మీ వైద్యాన్ని నమ్ముకున్న

అమలాపురం                                        హేమవతి

2-బి

" హేమవతిగారికి,

నమస్తే- మీరు రాసిందాని ప్రకారం మీది జబ్బుకాదు. ఒక రకమైన మానసిక పరిస్థితి మాత్రమే! ఆ ఉద్యోగినుల స్థానంలో మిమ్మల్ని ఊహించుకోవడం మాత్రం అంత మంచిది కాదు. సుబ్బరంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి భార్య అయిన వల్లి లాగానో, వేంకటేశ్వర స్వామి భార్య అయిన అలివేలు లాగానో ఊహించుకోండి. ఇందుకు దోహదం చేసేందుకు వీలుగా నక్సువామికా । ముప్పై మందును రోజూ రాత్రిపూట భోజనానికి గంట ముందుగా వేసుకుంటూండండి. రెండు వారాల తరువాత రాయండి. బెల్ ఆపేయండి.

మీ విధేయుడు

కాకినాడ                                        భైషజం"

3-ఎ

" ప్రియమైన డాక్టరు గారికి,

అనేక నమస్కారాలు.

కలల విషయంలో మీరు చెప్పినట్టుగానే చేశాను. అయితే, " ఉన్నదీ పోయే, ఉంచుకున్నదీ పోయే" అన్నట్టు (క్షమించండి, కొంచెం మోటుగా చెబుతున్నానేమో) కొత్త ఆనందం రాకపోగా ఉన్న ఆనందం కాస్తా పోయింది... ... నన్ను వల్లీదేవి లాగా ఊహించుకుంటూన్నప్పుడుల్లా నాకో సవితి, దేవ సేనాదేవి ఉన్నట్లనిపిస్తోంది. అలివేలులాగా ఊహించుకున్నా అంతే- ఒక మంగా దేవి ఎవత్తో అవతలి గదిలో మంచం మీద కూర్చుని నా భర్తని పిలుస్తున్న ఫీలింగొస్తోంది. పోనీ దేవతల్ని మారుద్దామా అంటే సవతిలేని దేవేరి ఎవత్తే నాక్కనిపించడం లేదు. దేన్నయినా సహించగలదు గాని ఆడది సవతిని సహించగలదా భూమ్మీద. చెప్పండి. నక్సు వల్ల నా జీర్ణశక్తి పెరిగిందంతే ! అంతకన్నా మార్పేమీ లేదు.

నమస్తే

హేమవతి "

3-బి

" హేమవతిగారికి,

మీ ఉత్తరం అందింది. మీ సమస్య నాకర్థమయింది. సవతి లేని దేవేరే లేదన్నారు. ఇది తొందరపాటు మాట. మహాసాధ్వి సీతాదేవి లేదా? మనం ఏ పూజ చేసినా " సీతా సమేత శ్రీ రామచంద్ర దేవతాయై నమః" అని చదువుతాం గదా జ్ఞాపకం లేదా? మీకు కలలు కన్నట్టూ ఉంటుంది. "సీతారాం, సీతారాం, సీతారాం, జయసీతారా" అనుకుంటూ ఉండండి. సంసార సుఖం మీ సొంతమైపోతుంది.

నక్సు వామికా కొనసాగించండి

భవదీయుడు

భైషజం "

4-ఎ

" భైషజం గారికి,

నమస్తే,

సీతాదేవి సవతిలేని మహాసాధ్వే, కొశ్చన్ లేదు. కానీ, ఆవిణ్ణి తలుచుకోవాలంటే ఎలర్జీగా ఉంటోంది. అడవులూ, తుప్పలూ, తోటకూర పులుసూ జ్ఞాపకం వస్తున్నాయి. " ఆవిడ మొగుడైతే ఆవిడ కోసం తపించాడు. నాభర్త ఎవరి కోసం తపిస్తాడో తెలియదు కదా ?" అన్న ఆలోచనతో నాగుండె అవిసిపోతోంది. దేవేర్లతో వచ్చిన గొడవ ఇది కనుక అసలు వాళ్ళని తలుచుకోడమే మానేశాను.

ఎలిజబెత్ టేలర్ ని తలుచుకుంటున్నాను. అంతే - ఆనందం నాలో అణువణువునా నిండిపోయి తెరలు తెరలుగా నన్ను ఊపేసి విసిరేస్తోంది. అదేదో కథలోలాగా మాజిక్ తివాచీ ఎక్కి ఆకాశంలో దూసుకుపోతున్న ఫీలింగొస్తోంది.

ఎలిజబెత్ టేలర్ - ఆరుగురు మొగుళ్ళ తరువాత ఏడో మొగుణ్ణి కట్టుకోబోతున్న అదృష్టవంతురాలు. ఏడుగురు మగరాయుళ్ళను తన చుట్టూ తిప్పుకోగలిగిన హాలీవుడ్ వీరనారీమణి. ఆ ఏడో మొగుడు ఎంతందగాడో మొన్న సినిమా వార పత్రికలో చూశాను. అతను ఆ టేలర్‌ని ఎంతగా ప్రేమించి కరిగిస్తాడోగదా! అతని ఫోటోను నేను చూడగలగడమే మహాభాగ్యం. నేనే కాస్సేపు ఎలిజబెత్ టేలర్‌ని అని ఊహించుకుంటే నా మనస్సుకి ఎంత ఆనందమో, టెన్షన్ నుంచి ఎంత విడుదలో చెప్పలేనండి డాక్టరుగారూ!

తప్పా?

వెంటనే రాయగలరు

నక్సువల్ల ఆకలీ, జీర్ణశక్తి బాగా పెరిగాయి

మీ విశ్వాసపాత్రురాలు

హేమవతి

4-బి

"హేమవతి గారికి, నమస్కారాలు,

తప్పా అనడిగారు తప్పుకాదు తప్పున్నర!

ఎలిజబెత్ టేలర్, లారా టర్నర్, బ్రిగెట్టీ బార్డట్, సోఫియా లారెన్, సిరిదేవి, విజయప్రద వంటి సినిమా తారలని తలుచుకోవడం మంచిది కాదు. ఎందుకంటే "వీళ్లు నా భర్తలు, వీళ్లు పరాయి భర్తలు" అనే భేదభావం లేని అంతర్జాతీయ వ్యక్తిత్వం గల వ్యక్తులు వాళ్లు! తమ తమ భర్తల్ని మీ కలల్లోకి ఇటు పక్క నుంచి పంపినట్టే పంపి, అటు పక్క నుంచి మీభర్తను ఎగరేసుకుపోయినట్టుగా కూడా కనపడగలరు! భరించగలరా? పరాయి భర్తల జోలికి పోకండి !

మీ భర్త మీకు ఎప్పుడూ పాతగానే కనిపిస్తాడనుకుంటాను కదూ? అందుకేననుకుంటాను మీకు ఆ పగటికలలూ, నిజం కలలూను ! ఓ పని చెయ్యండి, మీ భర్త గారిని వివిద భంగిమల్లో ఫోటోలు తీయించండి. కళ్ళగంతలు కట్టీ, మొహానికి ముసుగేసి, మొహమూ, కాళ్ళూ వుంచి నడుము మూసేసి, తల మీద చంబల్ వీరుడి తలపాగా పెట్టీ, ఇంకా అనేక రకాల విగ్గులు పెట్టీ, పాంకోళ్లు తొడిగీ, చెప్పులు తొడిగీ, గోచీ, పొట్టి లాగూ, పంచె, విభూతి పట్టెలూ, వైష్ణవ నామాలూ, బుగ్గన చుక్కతో కళ్యాణం బొట్టూ - ఇట్టాంటి రకరకాల మేకప్‌లు చేసి- ఫోటోలు తీయించండి. ఇంకా అర్ధనగ్నంగానూ, పావు నగ్నంగానూ, అరపావు నగ్నంగానూ కూడా ఫోటోలు తీయించండి. ఎన్ని రకాల ఫోటోలు చూశారా? మంచి ఊపుగా విచారం వచ్చినప్పుడూ, వరదలాంటి ఆనందం మిమ్మల్ని ముంచెత్తినప్పుడూ, ఈ ఫోటోల్ని మీ కెదురుగా పెట్టుకోండి. ఇంత మంది భర్తల్ని ఉచితంగా కలిగున్న అదృష్టానికి మీరప్పుడు పొంగిపోకుండా ఉండగలరా? ప్రయత్నించండి.

నక్కు వల్ల మీకు అన్ని రకాలుగానూ ఆరోగ్యం బాగుందని తలుస్తాను.

నమస్సులతో

మీ

భైషజం"

5-ఎ

"డాక్టర్ భైషజం గారికి నమస్సుమాంజలులు,

మీ సూచన- అదే పరాయి మగాళ్ళనూ, ఆడాళ్లనూ కలల్లోకి రానివ్వద్దని చెప్పడం బాగుంది. నాకర్థమయింది. కానీ మీకే అసలు సమస్య అర్థం కాలేదండీ బాబూ! నా భర్త ఉన్నాడే, ఆయన ఆయన ఒక పెద్ద ఫూల్! సన్నాసి! మేమిద్దరం ఏకాంతలో ఉన్నప్పుడు బయటి ఆడాళ్ళ విషయం వర్ణిస్తారని చెప్పాను గదా! వాళ్ళు సెంటు పూసుకుంటార్ట ఉత్తరాలు రాసి పెడుతుంటార్ట - ఇంకా ఏవేవో చేస్తూంటార్ట ఇవన్నీ వింటూ కూర్చోమంటే నాకు బాధగా ఉండదా? కనక అప్పుడు ఆయన పక్కనే ఆ మంచం మీదే కూర్చుని నాకానందం కలిగించే కలలేవో నేను కంటుంటాను నేను రోడ్డు మీద నడుస్తుంటే మా పక్కింటి కుర్రాడొచ్చి (బాగా డబ్బున్న వాడు లెండి) పుట్టెడు గులాబీ పూలు నా మీద కుమ్మరించి, చటుక్కున నన్నెత్తుకొళ్ళి కార్లో కూర్చోబెట్టుకుని తీసుకెళ్ళిపోయినట్టొకసారి - "నా భర్త ఒట్టి సుద్ద ముద్ద అయిపోయాడుగదా" అని విచారిస్తూ విశాఖ పామ్ బీచ్ లో నేను విచారిస్తుంటే నా చిన్న నాటి క్లాస్‌మేట్ ఒకడు హఠాత్తుగా నా ముందు ప్రత్యక్షమై - బంగారపు రంగు గుర్రంగా మారిపోతే నేను ఆడ గుర్రంగా మారిపోగా - ఆ వెంటనే మేమిద్దరం జతకట్టినట్టింకోసారి - ఇట్లా అనేక సార్లు అనేక గమ్మత్తయిన కలలు కంటూంటాను ఇంకా నా భర్తని - "ఇంత సంపాదిస్తున్నావు - ఒక్క వడ్డాణం చేయించ

లేవూ?'' అని గదమాయించినట్లూ - ఆయన నన్నేదో అనబోతే నేనాయన మీద తిరగబడి నాలుగు బాదినట్లూ కూడా కలలొస్తుంటాయి తెల్లారాక నేనేదో తప్పుచేసిన దానిలాగా ఫీలవుతుంటాను ఏం చెయ్యను చెప్పండి? మా ఆయన నన్నర్థం చేసుకుని నాకు ఆ ఆడవాళ్ళ కథలు చెప్పడం మానేసి నాతో కులాసాగా గడిపితే నేను ఈ కలల్ని ఆశ్రయించడం ఎందుకు చెప్పండి? నేనసలు మిమ్మల్ని అడిగింది దీనికి మందు

నక్సు బాగానే పని చేస్తోంది కానీండి. ఈ మధ్య ఎందుకనో ఒళ్లంతా దురదలు మొదలయ్యాయి ఏం వాడమంటారో దయచేసి చెప్పగలరు

మీ గౌరవ పాత్రురాలు

అమలాపురం హేమవతి ''

5-బి

'' శ్రీమతి హేమవతి గారికి,

నమస్కారాలు,

మీ ఒంటి దురదలకు 'సల్ఫర్ - ముప్ఫైని' రోజూ ఉదయం ఒక డోసు వేసుకోండి ఒక వారం తరువాత తెలియబరచండి. నక్సు మానేయండి.

పోతే మీ కలల విషయం : భర్త అంటే డబ్బు తెచ్చే యంత్రం అనే భావం మీకుండడం మంచిది కాదు. జీవితంలో డబ్బంత విలువైనవి చాలా ఉన్నాయి. ఉదాహరణకి మాట కలయిక. అదే లేకపోతే సంసారం సున్న కనుక మీరు భర్తగారి దగ్గర ఆ మాట కలయిక కోసం ప్రయత్నించండి. బహుశా మీ శ్రీవారు, మీరు ఎట్లా కనబడితే తనకానందమో చెప్పడం కోసం డొంక తిరుగుడుగా ఆ ఆడాళ్ళ కథలు చెబుతున్నారోమో ఆలోచించండి. మీరు రియాక్ట్ అయి ప్రతి క్రియాత్మకంగా ఇతర మగాళ్ళను గురించి ఆలోచించడం మాత్రం మంచిది కాదు. లేకపోతే ఆయన ప్రవాహాన్ని ఆపటానికి మీరు కూడా కథలు చెప్పడం మొదలుపెట్టొచ్చు,

మీరేదో పెళ్ళికెళ్ళారు. ఒంటరిగా. ఆ రాత్రి అక్కడ ఒక గది చూసి - '' ఇక్కడ పడుకోవచ్చా?' ' అని ఎవరో పెళ్ళి వారిని మీరు అడిగారు అందుకామె - '' అబ్బే అందులో మగాళ్ళున్నారు'' అని వెళ్ళిపోయింది. మీరా గదిలోకి తొంగిచూసి లోపలికి వెళ్ళి గడియపెట్టుకుని ఆ మగాళ్ళ మధ్యనే పడుకున్నారు హాయిగా గడిపారు. పొద్దున్నే తేలితేలిపోతున్న ఒంటితో తృప్తిగా ఉన్న మొహంతో లేచి బయటకొచ్చారు.- ఇంత వరకూ కథ చెప్పి ఆపండి మీ భర్తగారి రియాక్షన్ గమనించండి మీరు చేసిన '' తప్పు'' కి ఏదో రకంగా ఆయన తన కోపాన్ని మీమీద చూపించబోతున్నప్పుడు - '' కోపమెందుకండీ బాబూ - ఆ ఇద్దరూ నాలుగైదేళ్ళ కుర్రకుంకలు'' అనండి

ఇంకో కథ - '' ఆహా - ఏమి క్షణాలు ! ఇంకో స్త్రీ తాలూకు భర్త ఒడిలో నేను గడిపిన ఆక్షణాల మాధుర్యం చెప్పగలనా- మానగలనా? అట్లా గడపగలిగిన ఆ అదృష్టమే గదా అదృష్టమంటే ! నా జీవితమే ధన్యం!.. దయచేసి - ఎవయా పరాయి భర్త? అని మాత్రం నన్నడక్కండి బాబూ!'' ఇట్లా అంటూ సుత్తి కొట్టండి కొట్టగా కొట్టగా మీ వారు మీ వైపు ఎట్లా చూస్తారో మీకు తెలుసు ఇంకోంచెం సాగదీయండి. వెర్రెత్తి పోయి మీమీద ఆయన కోపమూ, కసీ పెంచేసుకుంటారు గదా అప్పుడు- '' ఆ నవ మన్మథుడెవరో చెప్పక తప్పదంటారా? అని గోముగా అడగండి. అట్లా అని అని నెమ్మదిగా చల్లగా చెప్పండి - ఆయనెవరో కాదండి - మా నాన్న!'' అని

ఇట్లాంటి అసలుకి మోసంగాని, వడ్డీకి నష్టం గాని లేని కతలు బోలెడు చెప్పొచ్చు మీరు మీ

శ్రీవారికి. కాస్త ఆలోచిస్తే అవ్వే తడతాయి. ఎటొచ్చీ మధ్యాహ్నం పూట మాట్నీ ఆట మానేసి కూర్చోవాలి మరి! పోతే నేను హోమియోపతి ప్రాక్టీషనర్ని మామూలు ఫిజీషియన్ని కానీ నాకు మీ సమస్యని చెప్పి నేను ఆలోచించేట్టు చేసి నన్నొక సైకో అనలిస్టుగా అంటే మానసిక రోగ వైద్యుడిగా తయారు చేస్తున్నారు మీరు! బాగుందండీ! భలేవారు మొత్తానికి! అసలు మీరు మీ భర్త గారితో ఓసారి కాకినాడ వచ్చి నన్ను కలుసుకోగూడదూ. ఇంకా వివరంగా మీ ఇద్దరి మధ్యా సయోధ్య కుదర్చడానికి అవకాశం ఉంటుంది గదా !

నమస్తే

మీహితుడు

భైషజం"

6-ఎ

" డాక్టరు గారికి నమస్తే ,

మీ సలహా అద్భుతంగా ఉంది కానీండి, సుత్తి కొట్టడం నాకు మహా విసుగండి. ఎంత చెడ్డా ఆ సుత్తిశ్రీ గారి - అదే మా ఆయన గారి సుత్తి ఎట్లోగోట్లా భరించగలను గాని - ఎదురు సుత్తి మాత్రం నాకు పరమ బోరు!

మరొక విషయం మీ శ్రీమతి గారితో నాకు పరిచయం లేదు. ఒక వేళ ఆవిడ కూడా నాలాంటిదే అయి ఆవిడ క్కూడా నాకు లాగే కలలొచ్చి ఆ విషయం మీకు తెలిస్తే సహిస్తారా?... క్షమించండి. మీరు నాకు చెప్పిన సలహాలు మీ ఇంట్లో కూడా ఆచరించేవే అని తెలిస్తే నాకానందంగదాని !

నేను సల్ఫర్ వాడాను. గుణం పెద్దగా కనిపించలేదు.అందుకని డల్కమరాతో మార్చి మార్చి వాడాను. దెబ్బకి దురదా గిరదా ఎగిరిపోయింది.

నమస్తే

హేమవతి "

6-బి

" హేమవతి గారికి,

డల్కమరా వాడారా, ఎంత పని చేశారండీ! అది చాలా లోతుగా పని చేసే మందు. ఎముకలోంచి మజ్జలోకెళ్ళిపోయి నిలవుండి క్రమంగా పెద్ద పెద్ద రోగాలకు దారి తీయొచ్చు. అయినా నాకు చెప్పకుండా ఎందుకు వాడారు? ఇప్పుడు ఆరోగ్యం ఎల్లా ఉందో తత్ క్షణం రాయండి. అవసరమైతే విరుగుడు మందు చెబుతాను.

నమస్సుల్తో

భైషజం "

7-ఎ

" డాక్టరుగారికి,

నమస్కారములు,

అయ్యా సల్ఫర్, డల్కమరా రెండు కలిపి వాడితే చాలా చర్మ రోగాలు పోతాయని బెకెట్ రాసిన హోమియో గ్రంథంలో ఉందనే విషయం నాకు తెలుసు. అట్లా వాడడం ఏ మాత్రమూ ప్రమాదకరం

కాదని కూడా నాకు తెలుసు. నన్ను అనవసరంగా భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. న్యాయమా !

సెలవు!

హేమవతి''

7-బి

'' హేమవతి అని దొంగ పేరు పెట్టుకున్న నూకాలమ్మకి,

నువ్వటే రాక్షసీ?

సల్ఫర్‌ని డల్కమరాతో మార్చి వాడడం అనే విషయాన్ని చాలా మంది డాక్టర్లు పైకి చెప్పరు. బెకెట్ పుస్తకం ఈ చుట్టు పక్కల దొరకడం లేదు. ఊరూరా తిరిగి హోటళ్లలో బస చేసి హోమియో వైద్యం చేస్తున్న నేను - ఉచితంగా చేస్తూన్నప్పటికి ఎవరికీ ఈ విషయం చెప్పలేదు. ఎప్పుడో ఒకసారి ఇంట్లో నీకు తప్ప. నీడల్కమరా ఉత్తరం చూడగానే నీ మొత్తం వ్యవహారంలో అనుమానం వచ్చి నీ పాత ఉత్తరాలన్నీ మళ్ళీ చదివాను. కావాలనే నాగత ఉత్తరంలో నిన్ను బెదరగొట్టాను. దొరక్కూడదనుకుంటూనే ఇక్కడ పాపం నాకు దొరికిపోయావే పిచ్చి మొహమా!

నీ కలలూ కోరికలూ నీకుండొచ్చు- తప్పులేదు. కానీ వాటిని నామీద రుద్ది - డబ్బో బంగారమో అని నా ప్రాణం తీసే నువ్వు సంస్కారివా? మాట కలపడం ముఖ్యం అని చెప్పే నేను సుత్తిశ్రీనా. నేను చెప్పే కబుర్లు నీకు వెగటయ్యాయా? కాబట్టి ఎలిజబెత్ టేలర్ ఏడో మొగుడి మీద నీకు మనసు పోయిందా? నేను ఫూల్‌నా, సుద్దముద్దనా?.. .. .. తట్టు పర్ల సన్నాసీ?

మీ అన్నయ్య గారింటికి అన్నవరం వెళతానని నాతో చెప్పి అమ్మమ్మ గారింటికి అమలాపురం వెళ్ళి కూర్చుంటావా? పైగా ఈ చెత్త కరెస్పాండెన్సొకటా? నీకు కలలున్నాయని చెప్పడానికి ఇంత కన్నా ఇంకో మార్గమే లేకపోయిందా? నా మనస్సులోది బయటికి కక్కించి నన్ను వెటకారం చెయ్యాలని కాదూ నువ్వీ ఉత్తరాలన్నీ రాసింది!

దీపావళికి ఇంటికొస్తానన్నావు కదా పిల్లల్తో! రా, రా. గుమ్మం తొక్కు చెబుతా నీపని! ఆ పూటే నీ తోలు తియ్యకపోతే చూడు- పుండాకోర్!

నీ తుంటరి బుద్ధికి మొకుశ్రీ

భైషజం ''

(ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక 9-11-88)

★★★ ★★★ ★★★